క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: పేదల సమస్యల సాధనే లక్ష్యంగా సీపీఎం పోరాడుతుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో సిరిసిల్లలో నిర్వహిస్తున్న పార్టీ జిల్లా మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీవైనగర్‌లోని షాదీఖానాలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు, కర్షకులు పాల్గొనాలన్నారు. నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జువ్వాజి విమల, పద్మ, గణేశ్, సంపత్, రాజశేఖర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కమిషనర్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ శనివారం విధుల్లో చేరారు. గ్రూప్ 1పరీక్షల నేపథ్యంలో రెండునెలలు సెలవులో వెళ్లారు. దాంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా సంపత్ రెడ్డి కొనసాగగా మళ్లీ కమిషనర్ విధుల్లో చేరారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

గంభీరావుపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ పోటీలకు కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పార్థసారథి, శ్రీ రాం, శ్రీకృష్ణ, లక్ష్మీ సందీప్, అభిషేక్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరామారావు, పీడీభాను, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్‌వోసీ మంజూరు

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన శ్యాగ రాంచరణ్ చికిత్స కోసం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం రూ.1.50 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, రాంచరణ్ కుటుంబ సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

పకడ్బందీగా సర్వే


ముస్తాబాద్: సామాజిక, ఆర్థిక కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేశ్ అన్నారు. మండలకేంద్రంలో సామాజిక సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేశ్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి చేపట్టే సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్యుమరేటర్లకు అందుబాటులో ఉండి వివరాలను తెలపాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పెంచాలని మండల సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి తూకం వేయకపోవడంతో రోజుల తరబడి నిరీక్షిస్తున్నారన్నారు. దీంతో రైతులు గత్యంతరం లేక మధ్య దళారులకు ధాన్యం విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తూకం వేయకపోతే ఆందోళన చేపడుతామన్నారు. నాయకులు సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, పిల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్జీపూర్ మీదుగా బస్సు ప్రారంభం



ఇల్లంతకుంట : ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండలంలోని వెల్జీపూర్, ఓబులాపూర్, గూడెపుపల్లె, గ్రామాలకు పల్లె వెలుగు బస్సు సౌకర్యం కల్పించారు. కరీంనగర్ డిపో నుంచి వల్లంపట్ల, ఓబులాపూర్, గూడెపు పల్లె, వెల్జీపూర్ మీదుగా ఇల్లంతకుంటకు బస్సును శనివారం ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. వెల్జీపూర్ మాజీ సర్పంచ్ వెంకటేశం మాట్లాడుతూ పదేళ్ల క్రితం రద్దయిన బస్సును తిరిగి ఎమ్మెల్యే పునఃప్రారంభించినట్లు తెలిపారు.

డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంపుపై హర్షం

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షం వ్యక్తంచేశారు.

అథ్లెటిక్స్‌లో అతివలు..

- బరిలో దిగితే పతకాలు ఖాయం
- వెటరన్‌గా..రామానుజమ్మ..
- పవర్ లిఫ్టర్‌గా నేహా..

సండే స్పెషల్



సిరిసిల్లటౌన్: జిల్లా కీర్తి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడుతోంది. జిల్లా కేంద్రంలోని అతివలు అరుదైన ఘనత సాధించారు. సాధారణ కుటుంబంలో పుట్టి కష్టాలు ఎదుర్కొంటూనే అమ్మానాన్నలు, మెట్టింటి వాళ్లకు బాసటగా ఉంటూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. ఒకరు అరవై ఏళ్లుదాటినా.. వెటరన్‌'గా ఇంటర్నేషనల్ స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధిస్తున్న టముటం రామానుజమ్మ. మరొకరు మూడు పదుల వయస్సులో గృహిణిగా..పవర్ లిఫ్టర్‌గా జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించిన ఎస్.కే. నేహా. అటు గృహిణులుగా..ఇటు అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న మహిళామణి'ల విజయాలపై సండే స్పెషల్ కథనం..

ఇంటర్నేషనల్ వెట'రన్'.. 'రామానుజమ్మ'


సాధించిన పతకాలతో రామానుజమ్మ

నాకు పదేళ్ల ప్రాయం నుంచే అథ్లెటిక్స్ అంటే ఇష్టం. హైస్కూల్ స్థాయిలో ఎన్నో పరుగు పందెంలో పతకాలు సాధించా. 1995 నుంచి వెటరన్ అథ్లెట్స్‌లో పాల్గొంటున్నా. 1996లో కరీంనగర్‌లో రాష్ట్రస్థాయిలో స్వర్ణం, 1997లో కొత్తగూడెంలో ఏపీ వెటరన్ ఆమెచ్యూర్ అథ్లెటిక్స్‌లో రజతం, 1998, 1999లో వరుసగా బంగారు పతకాలు సాధించా. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్ వెటరన్ అథ్లెటిక్ మీట్, 2001 వరంగల్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాలు సాధించా. ఇక 2004–2005లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ పోటీల్లో రెండుసార్లు ప్రథమస్థానంలో నిలిచా. 2007లో వరంగల్, 2012లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి బహుమతులు సాధించా. ఏడుపదుల వయస్సులో ఇప్పటి వరకు పాతికేళ్లుగా పరుగుపందెం, జావలింగ్ త్రో, షాట్‌పుట్ క్రీడల్లో 60 బంగారు పతకాలు, 44 వెండి పథకాలు, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందుకున్నా. 2019లో అప్పటి ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ 'వయో శ్రేష్ఠ సమ్మన్' అవార్డు అందించారు. భారత్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అయోధ్యలో జరిగిన 70 ఏళ్ల విభాగంలో 1500 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందెంలో రెండు మెడల్స్ సాధించా. జీవితకాలం పరుగుల్లో 'రాణి'ంచేదుకు సాధన చేస్తున్నా.

పవర్ లిఫ్టర్ 'నేహా'..



మాది సాధారణ కుటుంబం. సిరిసిల్ల సుభాష్‌నగర్‌లో నివాసముంటున్నాం. తల్లిదండ్రులు ఫర్హత్ సుల్తానా– మజహర్‌కు నలుగురం ఆడపిల్లలం. నేను పెద్దమ్మాయిని కావడంతో కొడుకులు లేని లోటులేకుండా ఉండేదాన్ని. మా ఆయన అఫ్రోజ్ వెల్డర్. మాకు బాబు, ఇద్దరు కూతుళ్లు. చిన్నప్పటి నుంచే వ్యాయామ, పవర్ లిఫ్టింగ్‌పై ఆసక్తి ఉంది. స్కూల్ గేమ్స్‌లో కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో తరుచూ పాల్గొనేదాన్ని. మావారి ప్రోత్సాహంతో రోజూ ఇక్కడి నుంచి ఉదయం సిద్దిపేటలోని జిమ్ ఎక్స్‌ట్రీమ్‌లో వర్క్ అవుట్స్ చేస్తున్నా. తిరిగి ఇంట్లో పనులు చేస్తా. నాలోని ప్రతిభ గుర్తించి మొదట కోచ్‌లు శేఖర్, నిఖిల్ మాస్టార్లు గుర్తించి పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణనిచ్చారు. పవర్ లిఫ్టింగ్‌లో ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ సత్య డైట్‌ను ఇచ్చేవారు. రోజూ ఉదయమే 75 కిలోమీటర్ల ప్రయాణం, మూడు కిలోమీటర్లు నడిచి జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నా. గతనెల 24న హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పవర్ లిఫ్టింగ్ 60 కేజీల విభాగంలో 122.5 కేజీల బరువు ఎత్తి గోల్డ్‌మెడల్ సాధించా. జిల్లాకు మొదటి మెడల్ కావడం సంతోషంగా ఉంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించి గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యం.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల అర్బన్: ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు అక్కిణపల్లి భాస్కర్ అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు... అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని, చేసిన అప్పులు తీర్చలేక సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్పంచుల పక్షాన పోరాడిన కాంగ్రెస్ పార్టీ నాయకులే సర్పంచుల బిల్లులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సర్పంచుల పోరుబాట కార్యక్రమానికి భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి దుమ్ము అంజయ్య, సలహాదారులు చాకలి రమేశ్, కోశాధికారి వంశీకృష్ణ, కార్యదర్శులు కోల నర్సయ్య, గన్నాల లక్ష్మణ్, సల్ల నారాయణ, సుమతి, శ్రీనివాస్, దేవయ్య, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సిరిసిల్లటౌన్: ఏబీసీసీ, తెలుగు రాష్ట్రాల లీగల్ అండ్ హ్యూమన్‌రైట్స్ కోఆర్డినేటర్ ఎస్. దామోదర్‌రెడ్డిని సిరిసిల్ల ప్రభుత్వ ప్లీడర్ టి. కల్యాణ చక్రవర్తి కలిశారు. శనివారం దామోదర్‌రెడ్డి వేములవాడ వెళ్తున్న నేపథ్యంలో సిరిసిల్ల బైపాస్‌రోడ్డు వద్ద మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి



ముస్తాబాద్: మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేసే వరకు ఉద్యమం చేస్తామని కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజు బాలయ్య అన్నారు. ముస్తాబాద్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ శనివారం కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో మండల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణాలు, నగరాలకు వెళ్లలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, గత ప్రభుత్వం కళాశాల మంజూరు చేసినట్లు ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


బోయినపల్లి: అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ముస్తాబాద్: పరిసరాలను శుభ్రంగా ఉంకోవాలని, తడి పొడిచెత్తను వేరు చేసి అందించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పించారు. మండలంలోని ఆవునూర్‌లో సోమవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు రుణమాఫీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూఢ నమ్మకాలు వీడి సైబర్ మోసాలపై అప్రమత్తంగా వుండాలన్నారు. కళాకారుల బృందం నాయకుడు శ్రీధర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, పర్శరాములు, రామచంద్రం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో మండలంలోని మల్లాపూర్‌లో కళాప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆటపాటల ద్వారా సూచించారు. కార్యక్రమంలో టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష, పంచాయతీ కార్యదర్శి కే.మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో వందమంది విద్యార్థులకు ఆర్కమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద బాలశిక్ష పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూనగర్, గోపాల్ నగర్, తారకరామానగర్, నేరెళ్ల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు కే.గణేశ్, మమత, భారతి, ప్రభాకర్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

హద్దులు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌లో మైసమ్మ గుట్ట వద్ద ప్రభుత్వ భూమిని సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని గ్రామస్తులు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు వెంటనే స్పందించిన తహసీల్దార్ భూమిని సర్వే చేయాలని ఆర్ఐ సంతోష్‌ను ఆదేశించగా సర్వే చేశారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు దండు శ్రీనివాస్, చంద్రారెడ్డి, భీమయ్య, సత్తయ్య, దేవేందర్, చెక్కల సత్తయ్య, వరద బాబు, సీత్యానాయక్, గడ్డి నరేశ్ తదితరులున్నారు.

గ్రామసభ



బోయినపల్లి: బోయినపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం 2025–26 సంవత్సరానికి గాను ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని ఉపాధిహామీ పనులు నిర్వహించే కూలీలకు 14,300 పనిదినాలు కల్పించే లక్ష్యంగా రూ.76.40 లక్షల విలువగల పనులు గుర్తించేందుకు ప్రణాళిక తయారుచేయాలని ఎంపీడీవో భీమ జయశీల ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. ఈజీఎస్ ఏపీవో వనం సబిత, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, టీఏ మహేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా బీరయ్య



ముస్తాబాద్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి. బీరయ్య అదనపు బాధ్యతలు స్వీకరించారు. ముస్తాబాద్ ఎంపీవోగా పనిచేస్తున్న బీరయ్యకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా పనిచేస్తామన్నారు. అధికారులు, ఉద్యోగులు అందరు సహకరించాలని కోరారు

సంక్షిప్త వార్తలు

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వీర్నపల్లి: కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు అవుతున్నా ఇంతవరకు ధాన్యం తూకం వేయడం లేదని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ధాన్యం అమ్ముకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇంకెన్ని రోజులు నిరీక్షిస్తారన్నారు. ధాన్యం తూకంవేసి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌కు చెందిన పాముల శ్రీనివాస్ అనే ఆర్ఎంపీ వైద్యుడి కూతురు పావనికి ఎంబీబీఎస్‌లో సీటు రాగా శనివారం బొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మి, నాయకులు నారాయణరెడ్డి, లింగాల తదితరులు పాల్గొన్నారు.

15వ సారి రక్తదానం

ఎల్లారెడ్డిపేట: చందుర్తి మండలకేంద్రానికి చెందిన అనసూయ అనే మహిళకు రక్తం అత్యవసరం కావడంతో మండలకేంద్రానికి చెందిన ఈసరి కిరణ్ శనివారం మండలకేంద్రలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రక్తదానం చేశాడు. దీంతో 15 సార్లు రక్తదానం చేసిన కిరణ్‌ను పలువురు అభినందించారు.

విద్యార్థులకు అవగాహన

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, రామన్నపల్లె పాఠశాలలో శనివారం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అధికారుల ఆధ్వర్యంలో లైంగిక వేధింపులు, ఫోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో భూక్య రాజు నాయక్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్, హెచ్ఎం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

వీధి కుక్కదాడిలో చిన్నారికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి నవ్యపై వీధి కుక్క దాడిచేసి గాయపర్చింది. కుటుంబ సభ్యులు వెంటనే మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వార్డు అధికారిపై..

వేములవాడఅర్బన్: పట్టణంలోని రాంమందిర్ వీధిలో ఆర్థిక, కులగణనలో భాగంగా ఇంటింటా సర్వేకు వెళ్లిన వేములవాడ మున్సిపల్ వార్డు అధికారి ఆంజనేయులుపై శనివారం వీధికుక్క దాడి చేసింది. వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిరుపయోగంగా మారాయి. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన టాయిలెట్స్‌ను అందుబాటులోకి తేవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వెంటనే వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
లక్ష్మణ్, పంచాయతీ ఈవో, 9849597070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

'బండి'పై వినోద్‌కుమార్ వ్యాఖ్యలు హాస్యాస్పదం


సిరిసిల్ల అర్బన్: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు


వేములవాడఅర్బన్: మాట్లాడుతున్న సంతోష్ బాబు

సిరిసిల్ల అర్బన్: బీఆర్ఎస్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సిరిసిల్లలో బండి సంజయ్ కుమార్ అభివృద్ధి చేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. పట్టణంలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట నుంచి ఫోర్‌లేన్‌కు బీఆర్ఎస్ నాయకుల భూముల పోకుండా కాపాడుకున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు రాగుల రాజిరెడ్డి, సిరిసిల్ల వంశీ, సిరికొండ శ్రీనివాస్, శ్రీకాంత్, రామ్‌లింగారెడ్డి, సంతోష్, అఖిల్, తిరుపతి, జగదీష్ తదితరలున్నారు.

వేములవాడఅర్బన్: కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను తన పార్లమెంట్ ప్రజలు ఎక్కడ మరిచిపోతున్నారనే ఆవేదనతో కేంద్రమంత్రి బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సహకరించిన కేంద్రాన్ని చాలాసార్లు బదనాం చేసే ప్రయత్నాలు చేసిందన్నారు. మైనార్టీ నాయకులు పాషా, నామాల శేఖర్, నేరెళ్ల సాయి, రేగుల శ్రీకాంత్, తదితరులున్నారు.

చందుర్తి: బీజేపీకి ప్రజాధరణ చూసి ఓర్వలేక మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడు వినోద్‌కుమార్ విమర్శలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో కరీంనగర్ ఎంపీగా పనిచేసిన వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. సంజయ్ చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేశ్, నాయకులు పెరుక గంగరాజు, చిర్రం తిరుపతి, గడిగోప్పుల జీవన్, చింతకుంట సాగర్, వంకాయల కార్తీక్, కూతురు మహేందర్, పెరుక రంజిత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బీఆర్ఎస్ నేతలు విమర్శించడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు రమేశ్, రాజిరెడ్డి, పెద్దూరి పర్శరాంలు గౌడ్, విగ్నేష్ గౌడ్, నాగరాజుగౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి వైద్య నిపుణుడు ప్రకాశ్ శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ప్రకాశ్ వివరించారు. పలువురు విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

వీర్నపల్లి: యువకుడిపై దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ అధికారి లచ్చయ్య తెలిపారు. జవహర్ నాయక్‌తండాకు చెందిన అజ్మీరా తరుణ్ హార్వెస్టర్ నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన అజ్మీరా సాగర్‌తో పాత గొడవలుండగా అతని స్నేహితులు దేవేందర్, రవి, శ్రీహరితో కలిసి శుక్రవారం రాత్రి తరుణ్‌పై దాడిచేశారు. తరుణ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఏహెచ్ఐవో పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌డీఎఫ్ పథకం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. శనివారం ఆమె పనులను పరిశీలించారు. గ్రామస్తులు, నాయకులు ఏఎంసీ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను లక్ష్యంలోపు పూర్తి చేయాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు నిమ్మ లక్ష్మి, మహేందర్, ప్రభాకర్ రెడ్డి, గౌస్, మల్లారెడ్డి, మజీద్, పర్శరాములు, మధుసూదన్ రెడ్డి, నరేందర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తితో వైద్యసిబ్బంది భయాందోళన


పల్లె దవాఖాన ఎదుట బైఠాయించిన మతిస్థిమితం లేని వ్యక్తి

రుద్రంగి: మానసిక రోగి ప్రవర్తనతో మండలకేంద్రంలోని పల్లె దవాఖాన వైద్యసిబ్బంది, రోగులు భయాందోళనకు గురవుతున్నారు. రోజూ పల్లె దవాఖాన ముందు మతిస్థిమితం లేని వ్యక్తి బైఠాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వైద్యసిబ్బంది ఇక్కడినుంచి వెళ్లాలని సూచిస్తే అసభ్యపదజాలతో దూషిస్తున్నారని వారు వాపోతున్నారు. పల్లె దవాఖానలో ఎక్కువమంది మహిళా సిబ్బందే ఉండటంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామశాఖ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. పల్లె దవాఖానను ఇటీవల నిర్మించి ప్రారంభించారు. కానీ దవాఖాన చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో మానసిక రోగితో పాటు మందుబాబులు, పశువులు, విష పురుగులకు నెలవుగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. మానసిక రోగి భయంతో సిబ్బంది విధులకు వచ్చేందుకు జంకుతున్నారు.

- ఆర్థికసాయం అందజేత

చందుర్తి: మర్రిగడ్డకు చెందిన మహమ్మద్ సల్మాన్ బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన రెడ్డి యూత్ క్లబ్ సభ్యులు యువకుడి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని యూత్ అధ్యక్షుడు సంతపూరి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.